

లక్ష విలువైన గంజాయితో ఆరుగురు అరెస్టు 8లో

- నిందితుల్లో ఐదుగురు ఒడిశావాసులు
- కారు, ఆటో, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం

అమ్మో... మరో పులి! 8లో

- అనకాపల్లి మండలంలో దడపుట్టిస్తున్న బెబ్బులి
- వరుసగా మూగజీవాలపై దాడులు
- వెంకుపాలెం పరిసరాల్లో సంచారం





ఆర్టీసీ ప్రయాణికులకు గిఫ్ట్ కూపన్లు

- వినూత్న ప్రయోగం 8లో

న్యూస్‌రీల్

కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం: రంపచోడవరం డివిజన్ పరిధిలో రెండు కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేస్తున్నట్టు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులకు తప్పనిసరిగా డిగ్రీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 42 సంవత్సరాల వయసు గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 10వతేదీ లోపు తమ దరఖాస్తులను సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

ఓటు నమోదుకు 6,097 దరఖాస్తులు

- పట్టభద్రుల శాసనమండలికి ఈనెల 7 వరకు గడువు
- కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి, పాడేరు : ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలికి సంబంధించి ఓటు నమోదుకు 6097మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో 5038, ఆఫ్‌లైన్‌లో 1059 దరఖాస్తులు అందాయని వాటి పరిశీలన అనంతరం ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారికి పంపిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 7వ తేది వరకు ఓటు నమోదుకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిందని ఆయన వివరించారు. ఈ నెల 7వ తేదీ లోగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకోలేకపోయిన పట్టభద్రులకు ఈనెల 23 నుంచి డిసెంబర్ 9 వరకు నిర్వహించే అభ్యంతరాల స్వీకరణ సమయంలో కూడా ఓటు నమోదుకు అవకాశం ఉందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని అర్హులైన పట్టభద్రులంతా నిర్ణీత సమయంలోగా ఓటు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఐసీడీఎస్ సేవలు సద్వినియోగం

చింతపల్లి సీడీపీవో సూర్యలక్ష్మి



బాలింతలతో మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి

చింతపల్లి రూరల్: ఐసీడీఎస్ సేవలను చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. సూర్యలక్ష్మి సూచించారు. స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో రమ్యతో కలసి మండలంలో అన్నవరం పంచాయతీలో శుక్రవారం ఆమె పర్యటించారు. కొత్తూరుబయలు, కుమ్మరి వంచుల గ్రామాల్లో నాడు–నేడు అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ప్రీ స్కూల్ చిన్నారులకు అందుతున్న సేవలను ఆమె తెలుసుకున్నారు. ఐసీడీఎస సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు,గర్భిణులు పాల్గొన్నారు.

30న విశాఖలో ప్రాంతీయ రెవెన్యూ సదస్సు

హాజరుకానున్న ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, రెవిన్యూ అధికారులు

సాక్షి, విశాఖపట్నం : రెవెన్యూ వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ నెల 30న విశాఖలో రీజనల్ రెవెన్యూ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున, డీఆర్‌వో శ్రీనివాస మూర్తి తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశాల మేరకు సదస్సుకు ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. ఈ సదస్సులో ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం , విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన కలెక్టర్లు, డీఆర్వోలు, ఆర్డీవోలు, తహశీల్దారులు, రెవిన్యూ అధికారులు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం సెషన్‌లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం(రీ సర్వే), ఇళ్ల స్థలాల పంపిణీ, 22ఏ కేసులు, చుక్కల భూముల వ్యవహారాలపైనా, మధ్యాహ్నం సాదాబైనామా, అనాదీనం భూములు, ఆర్వోఆర్ యాక్ట్–మ్యుటేషన్స్, ఎస్‌ఎల్‌ఏ నిర్వహణ, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు, ఓటీసీ–నాలా, ఆక్రమణల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై సదస్సు జరగనుందని కలెక్టర్ డా.మల్లికార్జున, డీఆర్వో శ్రీనివాసమూర్తి వెల్లడించారు.

7న గిరిజన మహాసభ

మారేడుమిల్లి: మారేడుమిల్లి బోదులూరు సెంటర్‌లోని పాత మండలపరిషత్ భవనం ఆవరణలో ఈనెల 7న గిరిజన మహాసభ నిర్వహిస్తున్నట్టు గిరిజన సంఘం ప్రతినిధి సిరిమల్లిరెడ్డి శుక్రవారం తెలిపారు. గిరిజనలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారంలో భాగంగా నిర్వహించే ఈ సభకు అధిక సంఖ్యలో గిరిజనులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రజావైద్యం.. మరింత బలోపేతం

రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రుల్లో ఇప్పటికే ఈ వ్యవస్థ ఉండగా తాజాగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. వైద్యులు, సిబ్బంది పనితీరు మెరుగుతో పాటు వారి భద్రతకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని భావిస్తోంది. సీసీ కెమెరాల అమరిక బాధ్యతను హైదరాబాద్‌కు చెందిన బృహస్పతి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అప్పగించింది.

- పటిష్ట చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో సీసీ కెమెరా వ్యవస్థ
- మెరుగుపడనున్న సిబ్బంది పనితీరు
- రోగుల భద్రతకు దోహదం
- భావిస్తున్న ప్రభుత్వం



మందుల గదిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



మినుములూరు పీహెచ్‌సీలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు

సాక్షి, పాడేరు: జిల్లాలోని ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం, సిబ్బంది పనితీరు మెరుగుపై ప్రభుత్వం దృష్టి సారించింది.

దీనిలో భాగంగానే సీసీ కెమెరాలను అందుబాటులోకి తెచ్చింది. ఈ వ్యవస్థ సిబ్బంది, రోగుల భద్రతకు దోహదపడటమే కాకుండా ప్రజావైద్యం మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

జిల్లాలో 62 పీహెచ్‌సీల్లో..

జిల్లాలో 62 పీహెచ్‌సీల పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌కు చెందిన బృహస్పతి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఈ బాధ్యతను అప్పగించింది. ఈమేరకు అధునాతన సాంకేతికతతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, అరకులోయ మండలాల పరిధిలోని పీహెచ్‌సీల్లో ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. మిగిలిన మండలాల పరిధిలోని పీహెచ్‌సీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఈనెలాఖరుకు పూర్తి కానున్నాయి.

ప్రతి పీహెచ్‌సీలో నాలుగు చోట్ల..

ప్రతీ పీహెచ్‌సీ పరిధిలో నాలుగు చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.ఆస్పత్రి ఆరుబయట ప్రధాన వ్యూ, ఆస్పత్రిలోని ప్రవేశ ద్వారం, మందుల నిల్వ గది, ఆస్పత్రి లోపల రోగుల ఓపీ, వైద్యసిబ్బంది కనిపించే విధంగా వీటిని బిగిస్తున్నారు.

కలెక్టరేట్ నుంచి మానిటరింగ్

పీహెచ్‌సీల్లో సీసీ కెమెరాల వ్యవస్థను పాడేరు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేయనున్న మానిటరింగ్ విభాగానికి అనుసంధానం చేస్తామని వైద్యారోగ్యశాఖ అధికారవర్గాలు తెలిపాయి. ఇందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటుచేసి సిబ్బందిని నియమించనున్నారు. వీరి ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉంటుంది. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా సకాలంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తం అయ్యేందుకు సీసీ కెమెరాల వ్యవస్థ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

రౌండ్ ది క్లాక్ సేవలపై దృష్టి

జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో 24 గంటల (రౌండ్ ది క్లాక్) పాటు ప్రాథమిక వైద్యసేవలు కల్పన, ఆస్పత్రుల్లో మాతాశిశు సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అన్ని ఆస్పత్రుల్లో ఇద్దరు చొప్పున వైద్యులు, పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించింది. నాడు–నేడులో ఆస్పత్రులను అభివృద్ధి చేసి, మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తెచ్చింది. ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యం అందేలా చర్యలు చేపట్టింది.

సీసీ కెమెరాల వ్యవస్థతో మేలు



పీహెచ్‌సీల్లో సీసీ కెమెరాల వ్యవస్థ ఏర్పాటు చేయడం అందరికి మేలు చేకూరుతుంది. వైద్యులు, వైద్య బృందాలు తమ నిర్దేశిత సమయానికి ఆస్పత్రికి చేరుకుంటారు. పనితీరు మరింత మెరుగుపడుతుంది. నిర్లక్ష్యం అనే ఆరోపణలు ఇక ఉండవు. అలాగే వారి భద్రతతో పాటు, ప్రశాంతంగా విధులు నిర్వహించుకునేందుకు మార్గం ఏర్పడుతుంది. రోగులు, వారి సహాయకులకు ఆస్పత్రిలో 24 గంటల వైద్యసేవలకు సీసీ కెమెరాల వ్యవస్థ మరింత దోహదం చేస్తుంది.

– డాక్టర్ సి.జమాల్‌బాషా, డీఎంహెచ్‌వో

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర

మండల ఉద్యానవనశాఖ అధికారి అరుణకుమారి



రైతులతో మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి అరుణకుమారి

గూడెంకొత్తవీధి: గిరి రైతులు పండిస్తున్న కాఫీకి పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటైన మ్యాక్స్ సొసైటీ ద్వారా గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నట్టు మండల ఉద్యానవనశాఖ అధికారి అరుణకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలోని పెదవలస పంచాయతీ డొకులూరు, కుక్కితపాడు, రంపుల, చాపరాతిపాలెం గ్రామాల కాఫీ రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాఫీ రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించేందుకుగాను శాస్త్రీయ విధానాలు ఆచరించాలని సూచించారు. నాణ్యమైన కాఫీకి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధరలు ఉన్నాయన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా గిట్టుబాటు ధరలు చెల్లిస్తున్న సంస్థల ద్వారా అమ్మకాలు సాగించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కొండలరావు, సంఘం ప్రతినిధులు గిరిప్రసాద్, సింహాచలం, పోతురాజు, లక్ష్మీనారాయణ, బాలరాజు, అప్పారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గిరి రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రణాళిక

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే
- వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష



సమీక్షిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలోని గిరి రైతులు ఆర్థికాభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించి అందజేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. ఆయన తన చాంబర్‌లో శుక్రవారం వ్యవసాయం, వాటి అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ముందుగా ఐదు గ్రామాలను ఎంపిక చేసుకుని రైతులకు పంటలపై అవగాహన కల్పించాలన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గిరి రైతు గ్రూపులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు అందజేయాలని సూచించారు. ఇప్పటి అందజేసిన పరికరాలు, గ్రూపుల వివరాలపై వ్యవసాయశాఖ అధికారులతో చర్చించారు. అటవీ హక్కుల చట్టం ద్వారా పట్టాలు పొందిన గిరిజన రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు తెలుసుకున్నారు. రైతులు ఈ క్రాప్ బుకింగ్ విధిగా చేయించుకోవాలని సూచించారు. రైతులకు రాయితీపై ఇచ్చిన పవర్ టిల్లర్లు, మినీ రైస్‌మిల్లులు, ట్రాక్టర్లు, రొటావేటర్ల వినియోగంపై పర్యవేక్షించాలని ఆదేశించారు. హార్టికల్చర్‌శాఖ, వందన్ వికాస కేంద్రాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీసీసీ, వెలుగు ఆధ్వర్యంలో చోడిపిండి, పప్పుధాన్యాలతో బిస్కెట్ల తయారీ, పట్టు పరిశ్రమపై చర్చించారు. జాఫ్రా సాగు స్థితి గతులపై చర్చించారు. ఈ సమావేశంలో ఏపీడీ శ్రీనివాసరావు, ఏడీ సీహెచ్‌కేవీ చౌదరి, సావిత్రి, జీసీసీ మేనేజర్లు పార్వతీశం, ముర్ల రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మన్యం అనేసరికి అందరికీ గుర్తొచ్చేవి వలిసె పూల అందాలు..ఇక్కడి వచ్చే పర్యాటకులు తప్పనిసరిగా వీటి అందాలను తిలకిస్తూ మంత్రముగ్ధులవుతుంటారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున వలిసె పూలు విరబూశాయి. ఒక పక్క మంచు అందాలు.. మరో పక్క పసుపు పచ్చని తివాచీ పరిచినట్టుగా వలిసె పూలు కనువిందు చేస్తున్నాయి.

– డుంబ్రిగుడ

సదరం శిబిరం విజయవంతం

- రిజిస్ట్రేషన్ చేసుకున్న 800 మంది దివ్యాంగులు
- అర్హులకు ధ్రువపత్రాల పంపిణీ



శిబిరానికి దివ్యాంగుడిని ఎత్తుకుని తీసుకెళ్తున్న గూడెంకొత్తవీధి ఎస్‌ఐ అప్పలసూరి



దివ్యాంగుడిని పరీక్షిస్తున్న వైద్యుడు

చింతపల్లి రూరల్: చింతపల్లిలో శుక్రవారం దివ్యాంగులకు నిర్వహించిన సదరం శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 800 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని గ్రామ/వార్డు సచివాలయ విభాగం కమిషనర్ వికాశ్ మరమత్ తెలిపారు. పోలీసులు, గ్రామ సచివాలయ విభాగంలో ఆధ్వర్యంలో చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల గుర్తింపు నిమిత్తం మెగా క్యాంపు నిర్వహించారు. గ్రామ వార్డు సచివాలయ కమిషనర్ వికాశ్ మరమత్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ల కోసం దివ్యాంగులు విశాఖపట్నం వెళ్లేందుకు ఆర్థికభారంతోపాటు ప్రయాసకు గురికావాల్సి వస్తోందన్నారు. అందువల్లనే ఈ శిబిరం ఏర్పాటుచేశామని చెప్పారు. ఏఎస్పీ ప్రతాప్ కిషోర్ మాట్లాడుతూ మండలంలో చాలా చోట్ల కదల్లేని స్థితిలో ఉన్న దివ్యాంగులను చూశామని చెప్పారు. వెంటనే సదరం శిబిరం నిర్వహించాలన్న ఆలోచనకు వచ్చి అధికారులను సంప్రదించి శిబిరం ఏర్పాటుచేశామని చెప్పారు. అనంతరం దివ్యాంగులకు ధ్రువపత్రాలను అందజేశారు. సబ్ కలెక్టర్‌ఆ అభిషేక్, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ నర్సింగరావు, డీఎల్పీవో, డీఎంహెచ్‌వో స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక వాహనాల్లో తరలించిన పోలీసులు

గూడెంకొత్తవీధి: చింతపల్లిలో పోలీసులు నిర్వహించిన సదరం శిబిరానికి పోలీసులు ఉచిత రవాణా సదుపాయం ఏర్పాటు చేశారు చింతపల్లి ఏఎస్పీ ఆదేశాల మేరకు గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ అప్పలసూరి మారుమూల గ్రామాల నుంచి దివ్యాంగులను చింతపల్లి తరలించేందుకు ప్రత్యేకంగా వాహనాలను సమకూర్చారు. దేవరాపల్లి తోకచిలుక గ్రామం నుంచి దివ్యాంగుడిని ఎస్‌ఐ అప్పలసూరి తన చేతులమీదుగా రహదారి సౌకర్యం ఉన్న ప్రాంతం తీసుకువెళ్లి వాహనం ఎక్కించారు. సీలేరు, దారకొండ, సప్పర్ల, గాలికొండ, అమ్మవారి దారకొండ, దుప్పులవాడ పంచాయతీకు చెందిన దివ్యాంగులను సదరం శిబిరానికి తరలించారు. ఈ వాహనాలను సీఐ జెండా ఊపి ప్రారంభించారు.



దివ్యాంగుల కోసం ఏర్పాటుచేసిన వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఐ అశోక్ కుమార్

12న జాతీయ లోక్ అదాలత్

అరకులోయ రూరల్: లోక్ అదాలత్‌తోనే కేసులు సత్వర పరిష్కారం జరుగుతాయని స్థానిక ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి డి.ఉమాదేవి అన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి పోలీసు అధికారులు, న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 12న స్థానిక కోర్టు ఆవరణలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో పెండింగ్ కేసుల పరిష్కారానికి అందరూ కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో ఏపీపీ రమేష్, అరకు సీఐ జీడిబాబు, ఎస్‌ఐలు కుమార్‌బాబు, సంతోష్‌కుమార్, న్యాయవాదులు మురళీమోహన్, రాంబాబు, ప్రభాకర్, సింహాచలం, నారాయణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఉమాదేవి

పోలవరం పరిహారం పంపిణీలో అక్రమాలపై దర్యాప్తు

విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు భూ నష్టపరిహారం పంపిణీలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరుగుతోందని విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను శుక్రవారం ఆయన ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ముంపులో దేవీపట్నం పోలీసుస్టేషన్ ఉన్నందున కొత్త పోలీసుస్టేషన్ భవన నిర్మాణానికి స్థల సేకరణ జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు భూ నష్ట పరిహారం పంపిణీలో జరిగిన అక్రమాలకు సంబంధించి ఇప్పటికి ఆరుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఏఎస్పీ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అడ్డతీగల: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నాడు స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు దాడిచేసిన వాస్తవ పోలీస్‌స్టేషన్ సందర్శించారు. పోరాటానికి సంబంధించి గోడలపై ఉన్న చిత్రపటాలను తిలకించి వివరాలు తెలుసుకున్నారు.అడ్డతీగల సీఐ వై.రాంబాబు, ఎస్‌ఐ అప్పలరాజు పాల్గొన్నారు.

గిరి యువత ఉపాధికి ప్రాధాన్యం

రాజవొమ్మంగి: గిరి యువతకు మెరుగైన ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ ఠాణా నిర్వహణలపై సీఐ రవికుమార్, ఎస్‌ఐ గోపీ నరేంద్ర ప్రసాద్‌లకు సూచనలు ఇచ్చారు. గంజాయి, పశువులు తదితర అక్రమ రవాణాపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ యువత మంచి మార్గాల్లో రాణించేలా కెరీర్ గైడెన్సు ఇస్తున్నామన్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల వారీగా ప్రేరణ కార్యక్రమం నిర్వహించి 64 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్టు చెప్పారు. ప్రస్తుతం వీరిని శిక్షణ నిమిత్తం తమిళనాడు పంపించామని, అక్కడి నుంచి వచ్చిన అనంతరం ఉద్యోగాల్లో చేరతారన్నారు. జాబ్ మేళాలు ఏర్పాటు చేసి యువతీయువకులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కృషి జరుగుతోందన్నారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎక్కడికక్కడ చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ భూముల్లో కాఫీ తోటలు, నిమ్మ రాజ్‌మా చిక్కుళ్లు, సపోటా, వరి, పసుపు తదితర ఉద్యాన వంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాలు, మొక్కలు, వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. రంపచోడవరం ఇన్‌చార్జి ఏఎస్పీ మహేశ్వరరెడ్డి ఉన్నారు.



దేవీపట్నం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీఐజీ హరికృష్ణ



అల్లూరి దాడిచేసిన నాటి పోలీస్‌స్టేషన్‌లోని పోరాట ఘట్టాలచిత్రాలను తిలకిస్తున్న డీఐజీ



రాజవొమ్మంగి పోలీసు స్టేషన్‌ను సందర్శించిన డీఐజీ హరికృష్ణ, ఎస్పీ సతీష్‌కుమార్

ఏజెన్సీలో మళ్లీ వర్షాలు



పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో కురుస్తున్న వర్షం



కొయ్యూరులో కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: గత రెండు రోజుల నుంచి ఏజెన్సీలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం పొగమంచు, మధ్యాహ్నం నుంచి వాతావరణం మబ్బుగా మారి వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి చింతపల్లి ప్రాంతంలో వర్షం కురిసింది. సాయంత్రం నుంచి కొయ్యూరు, పాడేరు, జి.మాడుగుల, పెదబయలు ప్రాంతాల్లో వర్షం నెలకొంది. పాడేరు పట్టణంతో పాటు, సమీప గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. ఈ అకాల వర్షాలతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొంగిన వాగు.. నిలిచిన వాహనాలు

రాజవొమ్మంగి: మండలంలో పలు చోట్ల శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీనికి తోడు ఎగువున కురిసిన వర్షం కూడా తోడు కావడంతో దూసరపాము–లబ్బర్తి గ్రామాల మధ్య చిత్రోలుబోతు వాగు పొంగి ప్రవహించింది. ఈ మార్గంలో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. మండలంలోని గదుఓకుర్తి గ్రామానికి జర్తా సన్యాసిరెడ్డిని ఆస్పత్రికి తరలించేందుకు రాజవొమ్మంగి నుంచి ఆ గ్రామానికి బయలుదేరిన 108 వాహనం కూడా వాగు ప్రవాహం కారణంగా నిలిచిపోయింది. వాగు ఉధృతి తగ్గిన తరువాత గడుఓకుర్తి వెళ్లింది. అప్పటికే సన్యాసిరెడ్డి మృతి చెందినట్టు 108 సిబ్బంది తెలిపారు.

కొయ్యూరు: దాదాపుగా వారం రోజుల తరువాత శుక్రవారం భారీ వర్షం కురిసింది. కొయ్యూరు, బాలరేవుల, బూదరాళ్ల తదితర గ్రామాల్లో కురిసిన వర్షం మెట్ట పంటలకు మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి తెలిపారు. బూదరాళ్ల, ఎం భీమవరం, యూ.చీడిపాలెం పంచాయతీల్లో దాదాపుగా 60 గ్రామాల్లో సాగవుతున్న మెట్ట పంటలకు ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు.



వాగు పొంగడంతో నిలిచిన 108 తదితర వాహనాలు

కూలి పనులకు ఒడిశా వెళ్లి శవమయ్యాడు


రాజిబాబు(ఫైల్)

రావికమతం : కూలి పనుల కోసం ఒడిశా వెళ్లిన గాలి రాజిబాబు(52) అనే వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. తన భర్త మృతిపై అనుమానాలున్నాయని మృతుని భార్య రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొత్తకోట ఎస్‌ఐ విభీషణరావు శుక్రవారం తెలిపారు. తన భర్త కొంత మంది కూలీలతో కొన్ని రోజుల కిందట ఒడిశా వెళ్లారని గురువారం సాయంత్రం కలప తరలింపు చేస్తుండగా ప్రమాదవశాత్తూ రాజిబాబుపై కర్రలు పడి గాయపడ్డారని సహచర కూలీలు సమాచారం ఇచ్చారు. చిన్నగాయాలే అన్నారని ఆ ఫిర్యాదులో పేర్కొందన్నారు. అయితే శుక్రవారం ఉదయం తన భర్త మృతి చెందినట్టుగా ఫోన్ చేశారని, అంబులెన్స్‌లో గ్రామానికి తీసుకువస్తున్నామని ఒక్కరోజులోనే పొంతన లేని సమాధానం ఇవ్వడంతో తన భర్త మృతిపై అనుమానాలున్నాయని, పైగా తన భర్తను కూలి పనులకు తీసుకువెళ్లిన మాకవరపాలెం మండలం తూటిపాల గ్రామానికి చెందిన కొల్లి అప్పలనాయుడు ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోందని ఆమె ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసునమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అమ్మో... మరో పులి!

- అనకాపల్లి మండలంలో దడపుట్టిస్తున్న బెబ్బులి
- వరుసగా మూగజీవాలపై దాడులు
- వెంకుపాలెం పరిసరాల్లో సంచారం
- అనంతగిరి నుంచి వచ్చిన కొత్త పులిగా నిర్ధారణ


పులి పంజాకు బలైన మేకలు


పులి సంచరించిన ప్రాంతంలో జాడపై ఆరా తీస్తున్న అటవీ సిబ్బంది


పులి పాదముద్రల కొలతలు తీసుకుంటున్న అటవీ సిబ్బంది

అనకాపల్లి రూరల్ : అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో తాజాగా మరో కొత్త పులి సంచరిస్తోంది. అనంతగిరి అటవీ ప్రాంతం నుంచి తప్పిపోయి వచ్చిన ఆడపులిగా అటవీశాఖాధికారులు శుక్రవారం నిర్ధారించారు. ఈ విషయాన్ని స్థానిక ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కూండ్రపు కాశీ ప్రసాద్ సాక్షి వద్ద ధ్రువీకరించారు. కొన్ని నెలల నుంచి కాకినాడ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లోని అనేక మండలాల్లో తప్పించుకుని తిరుగుతున్న రాయల్ బెంగాల్ టైగరే మరలా అనకాపల్లి మండలంలోకి వెనక్కివచ్చిందని అందరూ భావించారు. కానీ తాజాగా అనకాపల్లి మండలం వెంకుపాలెంలో ఒకేరోజు 13 మేకలను పులి మట్టుబెట్టడంతో అటవీశాఖాధికారులు నివ్వెరపోయారు. పులిపాదముద్రలు పరిశీలించి, కొలతలు చూడగా 14సెం.మీ పొడవున పాదముద్ర వుందని, ఇది అనంతగిరి అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఆడపులిగా నిర్ధారించారు.

వెంకుపాలెం కేంద్రంగా సంచారం

తాజాగా జనం కళ్లు గప్పి తిరుగుతున్న ఆడపులి అనకాపల్లి మండలం వెంకుపాలెం కేంద్రంగా తన స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని ఆకలేసినప్పుడు మూగజీవాలపై పంజా విసురుతోంది. తాజాగా మూలపేట గ్రామానికి చెందిన ఈగల శ్రీను మేకల మందలో 13 మేకలను ఆడపులి నాలుగు రోజుల కిందటే బలిగొంది. తన మేకల మందలో కొన్ని మేకలు కన్పించకపోవడంతో ఆ ప్రాంతంలో గాలించిన శ్రీనుకు మేకల కళేబరాలు కన్పించడంతో సమాచారాన్ని స్థానిక అటవీశాఖాధికారులకు చేరవేశారు. నాలుగు మేకలను పూర్తిగా పులి తినేయగా, మిగిలిన 9 మేకలను చంపి రక్తాన్ని తాగేసినట్టు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ పులి అనకాపల్లి రేంజ్ అనకాపల్లి సెక్షన్ పంగిడి బీట్ పరిధిలో వెంకుపాలెం, సుందరయ్యపేట, మూలపేట గ్రామాలకు ఆనుకుని ఏడోవారి కొండపై తిరుగుతున్నట్టు గుర్తించారు.

పులిని చూసిన గ్రామస్తులు

బుధవారం రాత్రి 7–30 గంటల ప్రాంతంలో వెంకుపాలెంలో ఒక పులి రోడ్డు దాటుతుండగా ఇదే గ్రామానికి చెందిన నలుగురు గ్రామస్తులు చూశారు. ఆ సమాచారాన్ని అటవీశాఖాధికారులకు తెలియజేశారు. గురువారం మేకల కళేబరాలు దొరకడంతో పులి సంచారాన్ని ధ్రువీకరించారు. ప్రస్తుతం వెంకుపాలెం పరిసర ప్రాంతాలైన బౌలువాడ, మూలపేట ప్రాంతాల్లో సంచరిస్తోందని చెబుతున్నారు. నాలుగు రోజుల కిందటే సుందరయ్యపేటలో ఒక పశువుపై కూడా పులి దాడి చేసిన విషయం తెలిసిందే. వెంకుపాలెం గ్రామానికి చెందిన ఒక మహిళ గురువారం మధ్యాహ్నం తోటలోకి వెళ్తుంటే చెట్టుకింద పులిని గమనించి భయంతో పరుగులు తీసినట్టు స్థానికులు చెప్పారు. పులి సంచారంతో ఈ గ్రామాల ప్రజలు బయటకు రావడానికి, రైతులు పొలాల్లోకి పశువులను పంపేందుకు భయపడుతున్నారు. కొన్ని నెలలుగా అటవీసరిహద్దులు, జిల్లా హద్దులు దాటి ప్రజల్లో భయాందోళనలు కలిగించిన రాయల్ బెంగాల్ టైగర్ (మగపులి) ప్రస్తుతం విజయనగరం జిల్లా మెంటాడ సమీపంలో వున్నట్టు అటవీశాఖాధికారులు చెబుతున్నారు.

బాధిత రైతుకు నేతల పరామర్శ

పులి దాడిలో 13 మేకలను పోగొట్టుకున్న బాధిత రైతు ఈగల శ్రీనును శుక్రవారం అఖిలపక్ష నాయకులు పరామర్శించారు. సీపీఐ జిల్లా నాయకుడు వై.ఎస్. భద్రం, బీఎస్పీ జిల్లా ఇంఛార్జి సూదికొండ మాణిక్యాలరావు, ఆప్ నేత కొణతాల హరినాథ్‌బాబు, చేతివత్తుల సంఘం కన్వీనర్ కె.లక్ష్మణ్, ప్రజా సంఘాల నేతలు శ్రీరామ్, వెల్లంకి సత్యనారాయణ, నష్టపరిహారం ఇవ్వమని డిమాండ్ చేశారు. ఒక్కో మేకకు రూ.లక్ష ఇవ్వమని డిమాండ్ చేశారు.

పులి బారి నుంచి కాపాడండి



మేత కోసం కొండలు, పొలాల్లోకి వెళుతున్న పశువులను పులి చంపేస్తుంటే ఆర్థికంగా ఇబ్బంది పడాల్సివస్తుంది. అంతేగాకుండా పశువులను తోలుకురావడానికి వెళ్లినప్పుడు గనుక ఆ ప్రాంతంలో పులి వుంటే రైతుల ప్రాణాలకు కూడా ప్రమాదమే. అటవీశాఖాధికారులు ఈ పులి బారి నుంచి రక్షించాలి.

– బిక్కవోలు కనకరాజు, వెంకుపాలెం

ప్రాణాలు అరచేతిలో...



పులి సంచారం కారణంగా పొద్దుపోతే ఇంటి నుంచి బయటకు రాలేక ఇళ్లల్లోనే వుండిపోతున్నాం. ఎక్కడ దాగి ఎవరిపై దాడి చేస్తుందో అని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉంటున్నాం. ఈ పులిని వీలైనంత త్వరగా బంధించి మాకు, మూగజీవాలకు రక్షణ కల్పించాలి.

– భీశెట్టి నాగలక్ష్మి, సుందరయ్యపేట

రైతు భరోసా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


పాత్రుడు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్

పాడేరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకాన్ని అర్హులైన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పాడేరు డివిజన్ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.ఆర్.బి.పాత్రుడు స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రైతు భరోసా పథకం కోసం రైతు భరోసా పోర్టల్ ద్వారా అర్హులు దరఖాస్తు చేసుకునేందుకు నవంబర్ 30 వరకు గడువు ఉందన్నారు. ఈ మేరకు రైతులు సంబంధిత గ్రామ సచివాలయంలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, ఎంపీఈవోలను సంప్రదించి వారి లాగిన్ నుండి గ్రీవెన్స్ ఆప్షన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రెండో విడత రైతు భరోసా సొమ్మును గత నెలలోనే ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. పాడేరు సబ్ డివిజన్ పరిధిలోని పెదబయలు, ముంచంగిపుట్టు, పాడేరు, జి.మాడుగుల మండలాలకు చెందిన 717 మంది రైతులకు సొమ్ము వారి ఖాతాల్లో జమాకాలేదన్నారు. వారంతా బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఆధార్ నంబర్‌కు ఫోన్ నంబర్ కూడా లింక్ చేసుకోవాలన్నారు. రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లక్ష విలువైన గంజాయితో ఆరుగురి అరెస్టు

- నిందితుల్లో ఐదుగురు ఒడిశా వాసులు
- కారు, ఆటో, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం

ముంచంగిపుట్టు : దోడిపుట్టు పంచాయతీ కేంద్రం సమీపంలో అక్రమంగా ఒడిశాకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. గంజాయితో పాటు కారు, ఆటో, ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కె.రవీంద్ర కథనం ప్రకారం వివరాలివి. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారని పక్కా సమాచారం రావడంతో పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించి వారి ఆదేశాలతో మండలంలో గల దోడిపుట్టు పంచాయతీ కేంద్రం సమీపంలో శుక్రవారం ఉదయం ఎస్‌ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ జరిపారు. గంజాయి 2 కేజీల చొప్పున ప్యాకింగ్ చేసిన 25 ప్యాకెట్లను కారు, ఆటోలలో ఎక్కించి ఒడిశాకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆరుగురు వ్యక్తులను గుర్తించి చాకచక్యంగా పట్టుకున్నారు. వారిని అరెస్ట్ చేసి, గంజాయి, వాహనాలు, సెల్‌ఫోన్లు సీజ్ చేసి ముంచంగిపుట్టు పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి 50 కిలోలు ఉందని, దీని విలువ లక్ష రూపాయలు ఉంటుందని, పట్టుబడిన వారిలో పెదబయలు మండలం లింగేటి పంచాయితీ బురుగువీధి గ్రామానికి చెందిన సల్లంగి బన్నీ కాగా, ఒడిశా రాష్ట్రం కొరాపుట్టు జిల్లా లంతాపుట్టు గ్రామానికి చెందిన గుప్తా దార్లి, బ్రహమణీపుట్టు గ్రామానికి చెందిన కైలాస్ చంద్ర నాయక్, పాంగి సురేష్, కొలాబ్ నగర్‌కు చెందిన చిత్రసేన కిల్లో, మున్నా సగరియాలుగా గుర్తించామని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రవీంద్ర తెలియజేశారు. ఈ తనిఖీలో ముంచంగిపుట్టు పోలీసులు,హోంగార్డులు పాల్గొన్నారు.

7 నుంచి డెమో తరగతులు

ఈఎంఆర్ఎస్ కన్వీనర్ రమణ

రాజవొమ్మంగి: ఇటీవల గెస్ట్ టీచర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకొన్న వారు ఈనెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మారేడుమిల్లిలో జరుగనున్న డెమో క్లాసులకు, ఇంటర్యూల కోసం హాజరుకావాలని ఈఎంఆర్ఎస్ కన్వీనర్ ఎం.వి.రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని ఆరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో బోధించేందుకు అతిథి ఉపాధ్యాయుల కోసం నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా 80 పోస్టులకు గాను 300 మంది దరఖాస్తు చేసుకొన్నారని, అభ్యర్థుల సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కూడా పూర్తి కాగా ప్రస్తుతం డెమో క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మేథ్స్, సోషల్ టీజీటీలు ఈనెల 7వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు. అలాగే మేథ్స్, ఫిజికల్ సైన్స్, బయో సైన్స్, ఎకనమిక్స్, కెమిస్ట్రీ, పొలిటికల్ సైన్స్ బోధించే పీజీటీలు 8న హాజరుకావాలని, సైన్స్, ఇంగ్లీష్, హిస్టరీ పీజీటీలు 9న జరిగే డెమో క్లాసులకు హాజరుకావాలని తెలిపారు.

పేదలకు ఆసరాగా ఆఖరి ప్రయాణ రథం సేవలు


ఆఖరి ప్రయాణ రథంలో మృతదేహాన్ని ఎక్కిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అరకులోయ రూరల్: చినలబుడు పంచాయతీ కేంద్రానికి చెందిన కిల్లో లక్ష్మి(32) అనారోగ్యం కారణంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతు శుక్రవారం మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామాన్ని తరలించేందుకు ఆర్థికస్తోమత లేక కుటుంబ సభ్యులు పడుతున్న ఇబ్బందులను జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు లక్ష్మణరావు, సోషల్ మీడియా జిల్లా కో–కన్వీనర్ రంజిత్‌కుమార్ తెలుసుకున్నారు. ఈ విషయాన్ని వారు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు తెలియజేశారు. దీనిపై ఆయన స్పందించారు. మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆఖరి ప్రయాణ రథాన్ని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ పేదలకు ఆసరాగా మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ ఆఖరి ప్రయాణ రథం సేవలు అందిస్తున్నట్టు తెలిపార. పార్టీ శ్రేణులు మృతదేహాన్ని వాహనంలో స్వగ్రామానికి తరలించారు. దీనిపై మృతురాలి కుటుంబసభ్యులు ఎమ్మెల్యే పాల్గుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు రమేష్, సోషల్‌మీడియా సభ్యుడు దేవదాస్, సురేంద్ర తదితరులున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

అనకాపల్లిటౌన్: తుమ్మపాల ఏలేరు కాలువలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్‌ఐ సత్యనారాయణ చెప్పారు. మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉందని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9154879719, 9497930675 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

సంప్రదాయ నృత్య విభాగాల్లో 'జోనల్' పోటీలు

దరఖాస్తుకు ఈనెల 10 వరకు గడువు

పాడేరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి ఆధ్వర్యంలో కళాకారులకు సంప్రదాయ నృత్య విభాగాల్లో జోనల్, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. కూచిపూడి నృత్యం, ఆంధ్ర నాట్యం, భరత నాట్యం, గాత్ర(సింగింగ్), జానపద కళారూపలైన డప్పులు, తప్పెటగుళ్లు, గరగలు, కోలాటం, చెక్క భజన, కొమ్ముకోయ, సవర, లంబాడీ, తదితర విభాగాల్లో నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆయా విభాగాలకు సంబంధించి జోనల్ స్థాయి పోటీలు డిసెంబర్ 7,8,9 తేదీల్లో అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కళాకారులకు విశాఖ వుడా చిల్డ్రన్ థియేటర్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు వచ్చే నెల 19, 20 తేదీల్లో విజయవాడలో నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల కళాకారులు తమ దరఖాస్తులను ఈనెల పదో తేదీలోగా రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి కార్యాలయం విజయవాడ లేదా విజయనగరం, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, కర్నూలు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలు, పాఠశాలల్లో స్వయంగా సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 15 నుంచి 20 ఏళ్ల మధ్య వయసు గల కళాకారులు జూనియర్స్ విభాగానికి, 20 నుంచి 40 ఏళ్ల వయసు గల కళాకారులకు సీనియర్స్ విభాగానికి కేటాయిస్తామని చెప్పారు. జోనల్ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి సోలో విభాగంలో రూ.10వేలు, బృందం అయితే రూ.25 వేలు, రాష్ట్ర స్థాయి పోటీలో ప్రథమ స్థానం నిలిచిన వారికి సోలో విభాగానికి రూ.50వేలు, బృందానికి రూ.లక్ష నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఆసక్తి గల కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చోడవరంలో ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటుకు స్థలం కేటాయిస్తాం

- కళల కాణాచి అనకాపల్లి జిల్లా
- కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి
- జాతీయ స్థాయి చిత్రకళా పోటీలు, ప్రదర్శనకు ప్రారంభోత్సవం


జాతీయస్థాయి పోటీల్లో ప్రదర్శించిన చిత్రాలను చూస్తున్న కాలేజీ విద్యార్థులు, ప్రజలు

చోడవరం : చిత్రకళాకారులను ప్రోత్సాహం అందించడంతోపాటు, ఈ జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసేందుకు చోడవరంలో ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటుకు స్థలం కేటాయిస్తామని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. చోడవరం చిత్రకళా నిలయం ఆధ్వర్యంలో ప్రేమసమాజం ఆవరణంలో మూడు రోజుల పాటు జరగనున్న 5వ జాతీయస్థాయి చిత్రకళా పోటీలు, ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎందరో ప్రముఖ చిత్రకారులు వేసిన అనేక అద్భుతమైన చిత్రాలను ఈ పోటీలో ప్రదర్శించారు. వీటితో పాటు బాలలు వేసిన చిత్రాల ప్రదర్శన గ్యాలరీని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బొమ్మలను చూసి కలెక్టర్ ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లా ఎందరో కళాకారులు, ఎన్నో కళలు, ఆధ్యాత్మిక కేంద్రాలకు కేంద్రంగా ఉందని అన్నారు. చోడవరంలో చిత్రకారులకు భావితరాలకు దిక్సూచిగా ఉండడం ఆనందకరమన్నారు. చోడవరం ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటుకు సహకారం అందించాలన్న చిత్రకళా నిలయం ప్రతినిధుల కోరికపై ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని సమకూర్చుతానని కలెక్టర్ చెప్పారు. అంతేకాకుండా ఈ ప్రాంత చిత్రకారులు వేసిన అద్భుతమైన రెండు చిత్రాలను అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముందు భాగంలో పెట్టేందుకు స్థలాన్ని సమకూర్చుతామని చెప్పారు. చోడవరం చిత్రకళా నిలయం ఫౌండర్, పోటీల నిర్వహణ బొడ్డేడ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నం చిత్రకళాపరిషత్ ఫౌండర్ సుంకర చలపతిరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కాండ్రేగుల డేవిడ్, ఫోరం ఫర్ బెటర్ చోడవరం ప్రతినిధులు ప్రేమ సమాజం రాజు, ఆర్క్ ప్రసాద్, దేముడు మాస్టారు, టి.వి.రమణ, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు. చిత్రకళ ప్రదర్శనను చూసేందుకు పట్టణంలో ఉన్న పలు కాలేజీల విద్యార్థులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

ఆర్టీసీ ప్రయాణికులకు గిఫ్ట్ కూపన్లు

రాజవొమ్మంగి: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిలో ఉత్సాహం నింపేందుకే బస్సుల్లో గిఫ్ట్ బాక్సులు ఏర్పాటు చేసి లక్కీడ్రా స్కీం ప్రవేశపెట్టినట్టు ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎన్.బాపిరాజు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన లక్కీడ్రాలో మండలంలోని జడ్డంగి గ్రామానికి చెందిన అయిన దుర్గారావుకు ప్రథమ బహుమతి, లాగరాయి గ్రామానికి చెందిన పి.బంగారుశెట్టికి ద్వితీయ బహుమతులు పొందారు. ఏలేశ్వరం డిపోలో జరిగిన కార్యక్రమంలో డీఎం బాపిరాజు విజేతలకు బహుమతులను అందజేశారు. రాజవొమ్మంగి మీదుగా నర్సీపట్నం వరకు గత 15 రోజులుగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన బస్ టిక్కెట్లను గిఫ్ట్ బాక్సులలో వేసిన వారికి లక్కీ డ్రా తీయడం జరిగిందన్నారు.

మలేరియా విభాగం అవినీతిపై విచారణ జరపాలి

80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ

అనకాపల్లిటౌన్ : జీవీఎంసీ మలేరియా విభాగంలో భారీ అవినీతి జరిగిందని 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ ఆరోపించారు. శుక్రవారం గవరపాలెంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. సుమారు 18 నెలల కాలంలో జీవీఎంసీ పరిధిలో ఉన్న మలేరియా శాఖలో రూ.8 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా తన వార్డు పరిధిలో 22 డస్ట్‌బిన్లు కొనుగోలు చేసినట్టు అధికారులు రికార్డుల్లో నమోదు చేయగా, వార్డులో 12 మాత్రమే కనిపిస్తున్నాయన్నారు. మిగిలిన డస్ట్‌బిన్లు ఎక్కడున్నాయో చూపాలని అధికారులను ప్రశ్నించారు. 10 డస్ట్‌బిన్ల నగదు కాంట్రాక్టర్ జేబులోకి చేరిందా, లేదంటే మలేరియా విభాగం చేతివాటం చూపారా? అన్న లెక్క తేల్చాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.